

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..





# వచ్చే ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం

- గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసినవారంతా తిరిగి సొంత గూటికి రావాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- పార్టీలో చేరిన మాజీ కో ఆప్షన్ సభ్యులు



**ప్రజానావ, వేములవాడ/సిరిసిల్ల:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం వేములవాడలోని తాటికొండ రాజయ్య ఫంక్షన్ హాల్‌లో వేములవాడ మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్ 200 మందితో ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ప్రభుత్వ విప్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలోకి రావడం మళ్లీ తిరిగి సొంత ఇంటికి వస్తున్నట్లుగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు తనను ఆకట్టుకున్నాయని, ప్రజల కోసం మరింతగా పనిచేసేందుకు పార్టీలోకి వస్తున్నట్లు పేర్కొన్నారు. అనాడు కాంగ్రెస్ గెలిచిన 3 ఎంపీటీసీలలో తను ఒకడినని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీతో తనకు విడదీయరాని అనుబంధం పెనవేసుకుందిని కట్కూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని స్వాగతిస్తున్ననని అన్నారు..రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టి పేద ప్రజలకు అనేక పథకాలను రూపకల్పన చేసిందని తెలిపారు. కొత్త, పాత అనే తేడా లేకుండా కలిసిగట్టుగా పనిచేస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతీ ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. గత ప్రభుత్వాలు పేద ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందాం అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసి ఇతర పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని, వారంతా తిరిగి సొంత గూటికి రావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు కట్కూరి శ్రీనివాస్‌తో పాటు కాముటాల వేణు, కముటల రాజు, తాటికింద అనిల్, ఎర్రబెల్లి రాజశేఖర్, వంగర కిరణ్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, సెస్ డైరెక్టర్ నామాల ఉమా లక్ష్మీరాజ్యం, కొనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కాచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ధైత కుమార్, కృష్ణ, నాగరాజు, తోట రాజు పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట లహరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పూలే విగ్రహాలకు భూమి పూజ

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రి పూలె విగ్రహాలకు శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భూమి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను ముందు తరాలకు తెలిసేలా విగ్రహాలను పెడుతున్నట్లు చెప్పారు. ఆయన వెంట సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూప తిరుపతి రెడ్డి, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొక్కల రాము, బీజేపీ జిల్లా అధ్యక్షులు గోపీ, కాంగ్రెస్ పట్టణ అధ్యకుడు చొప్పదండి ప్రకాశ్ తదితరులున్నారు.

## ఖైరతాబాద్ కాంగ్రెస్‌లో భగ్గుమన్న
# విభేదాలు

**ఎమ్మెల్యే దానం, కార్పొరేటర్ విజయారెడ్డి అనుచరుల పోటాపోటీ నినాదాలు**


**అరగంట పాటు ఉద్రిక్త వాతావరణం**



**ప్రజానావ, ఖైరతాబాద్:** ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీలో మరోసారి వర్గపోరు విభేదాలు భగ్గుమన్నాయి. శనివారం లేక్‌వ్యూ బంజారాహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, విజయారెడ్డి అనుచరులు పోటాపోటీగా నినాదాలు చేశారు. అరగంట పాటు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ వ్యవహారంపై సభకు వచ్చిన డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసి, క్రమశిక్షణ లేని కార్యకర్తలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాంగ్రెస్, ప్రతిపక్షాల మధ్య పోటీలా కాకుండా విజయా రెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే దానం అన్న విధంగా సీన్ మారింది. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఇద్దరి మధ్య ఉన్న విభేదాలు స్పష్టంగా వెలుగుచూశాయి. ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ కార్పొరేటర్ పీ. విజయారెడ్డికి పార్టీ ప్రత్యేక స్థానం ఇచ్చింది. ఏకంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. తాజాగా ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరిన నాటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో విజయారెడ్డిని దూరం పెడుతూ వస్తున్నట్లు తెలుస్తోంది.

# హెచ్‌ఎండబ్ల్యూలో అక్రమ టాంకర్ దందా

**తాగునీటికి ఇబ్బంది పడుతున్న పలు బస్తీలు**




**ప్రజానావ, ఖైరతాబాద్:** ఖైరతాబాద్ నియోజవర్గంలోని జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, పద్మాలయా, అంబేద్కర్ నగర్ బస్తీల్లో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు తీవ్ర పడుతున్నారు. హెచ్‌ఎండబ్ల్యూలో బుక్ చేస్తే ఏదో ఒక సాకు చేసి మీ బస్తీలకు రాబోమంటూ క్యాన్సిల్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తమ బుకింగ్‌లను క్యాన్సిల్ చేసి డొమెస్టిక్‌లో కమెర్సిల్, బ్లాక్‌లో విక్రయించేందుకు వస్తారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఈ నీటికి రూ. వెయ్యి నుంచి రూ.2వేల వరకు అమ్ముకుంటారని ఆరోపించారు. ఇదేంటని అడిగితే ఎవరికైనా చెప్పుకోండి అనే నిర్లక్షపు సమాధానం వస్తుందంటున్నారు. హెచ్‌ఎండబ్ల్యూకి ఫోన్ చేసినా వారూ ఏం సమాధానం ఇవ్వట్లేదన్నారు. ట్యాంకర్ల బాగోతం తెలిసే అధికారులు సైలెంట్ గా ఉన్నారా.. లేక భయభ్రాంతులకు గురవుతున్నారా అని నిలదీస్తున్నారు. ఇదే విషయమై బస్తీవాసులు స్థానిక ఎమ్మెల్యే , కార్పొరేటర్‌ను కలిసే యోచనలో ఉన్నట్లు తెలిపారు.




# స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**ప్రజానావ, సిరిసిల్ల:** రాష్ట్ర క్రీడా పాఠశాలలైన హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో 2025-26 విద్యా సంవత్సరం 4వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల మండల స్థాయిలో జూన్ 17 నుంచి 18 వరకు ఎంపికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి దూస రఘుపతి, మండల ఎస్‌జీఎఫ్ కన్వీనర్ దేవత ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు పైన తెలిపిన స్పోర్ట్స్ స్కూల్లో అడ్మిషన్ పొందాలంటే ముందుగా తమ పేర్లను https://tgss.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మండల స్థాయి ఎంపికలలో ఎంపికైన వారు జిల్లా స్థాయికి అర్హత సాధిస్తారన్నారు. ఇందులో భాగంగా ప్రవేశం పొందే విద్యార్థులు 01-09-2016 నుంచి 31-08-2017 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. మండలస్థాయిలో పాల్గొనే బాల బాలికలు ఆధార్ కార్డ్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో పాటు విద్యార్హత ధ్రువీకరణ పత్రాని జతపరచాలని సూచించారు. అలాగే మూడో తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, కుల ధ్రువీకరణ పత్రం కూడా అవసరం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 17న బాలికలు, 18న బాలురు మండల స్థాయి ఎంపిక కోసం కాలేజీ గ్రౌండ్ లో ఉదయం 9 గంటల వరకు హాజరు కావాలన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 1846 కేసుల పరిష్కారం

**సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే**

**ప్రజానావ, సిరిసిల్ల:** రాజీమార్గాన కేసులను పరిష్కరించేందుకు శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1846 కేసులు పరిష్కరించడం జరిగిందని ఎస్పీ మహేశ్ బీ గితే పేర్కొన్నారు. కేసులను పరిష్కరించడంలో కృషిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. వీరితో పాటు పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లను ప్రతిరోజు మానిటరింగ్ చేస్తూ కేసుల పరిష్కరంలో కృషిచేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య, కోర్ట్ మానిటరింగ్ ఎస్ఐలు శ్రవణ్ యాదవ్, రవీంద్రనాయుడులను కూడా ఎస్పీ అభినందించారు.



